పేదల ఆరోగ్యమే పరమావధిగా..

- జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహణ
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- మిందిలో శిబిరానికి విశేష స్పందన


రోగి రొక్కం వెంకటరావుకు కళ్లజోడు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద వివరాలు నమోదు చేయించుకుంటున్న రోగులు


రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్ఓ జగదీశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం: పేదల ఆరోగ్యమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకువస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. 68వ వార్డు మిందిలోని గుడివాడ అప్పన్న కల్యాణ మండపంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పేరును చిరస్థాయిగా నిలిపేలా ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. విద్య, వైద్యరంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. సామాన్య ప్రజలు అనారోగ్యానికి గురైతే, కుటుంబాలు ఎలా జీవిస్తాయని ఆలోచించి వారికి చేరువలో ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేదప్రజలకు చేరువ చేసిన ఘనత మన సీఎం జగన్‌కే చెందుతుందన్నారు. అగనంపూడిలో రూ.17కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు.

చక్కని ప్రణాళికతో..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చక్కని ప్రణాళికతో అమలు చేస్తున్నారని కొనియాడారు. ఇక్కడ శిబిరం నిర్వహించేముందు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ సిబ్బందితో పాటు సచివాలయ ఏఎన్ఎంలు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి రోగాలతో బాధ పడుతున్న వారిని గుర్తించి, తక్షణ వైద్య పరీక్షలు చేయడంతో పాటు మెరుగైన వైద్యం అవసరమైన వారికి టోకెన్లు ఇచ్చి శిబిరాలకు హాజరవ్వాలని సూచించారన్నారు. ఇక్కడ శిబిరంలో జనరల్ ఫిజీషియన్‌తో పాటు స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండి వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేస్తున్నారని తెలిపారు. ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆరోగ్య సురక్ష బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కంటి పరీక్షలు నిర్వహించిన రొక్కం వెంకటరావు అనే వ్యక్తికి ఉచితంగా కళ్ల జోడు అందజేశారు.

ఆకట్టుకున్న ఫుడ్ స్టాల్

శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్ ఆకట్టుకుంది. స్టాల్‌ను పర్యవేక్షించిన ఎమ్మెల్యే నాగిరెడ్డి అంగన్‌వాడీ టీచర్లను అభినందిస్తూ నగదు బహుమతి అందజేశారు.

డీఎంహెచ్‌వో పర్యవేక్షణ

మెడికల్ క్యాంప్‌ను డీఎంహెచ్ఓ డాక్టర్ జగదీశ్వరరావు, అధికారులు ఉమావతి, విశ్వామిత్ర పర్యవేక్షించారు. శిబిరంలో 632 మంది సేవలు పొందారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సీహెచ్‌వో పి.నాగ అప్పారావుతో పాటు 10 మంది వైద్యులు సేవలు అందించారు. రోగులకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు షుగర్, బీపీ, ఆర్థో, గైనిక్, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి నెలకు సరిపడా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, కార్పొరేటర్ ఇమ్రాన్, జిల్లా ఫుడ్ విజిలెన్స్ కమిటీ మెంబర్ బోగాది సన్యాసిరావు, మండల కన్వీనర్లు మహ్మద్ గౌస్, బొడ్డా గోవింద్, విజిలెన్స్ కమిటీ మెంబర్ బోనెల జోసెఫ్, బీసీ డైరెక్టర్ గుర్రం రాజేష్, నాయకులు సంగ్రాన సూకరాజు వరదాడ వెంకట రమణ, గొంతిన వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాలాంటి వారికి ఎంతో భరోసా



నాకు షుగర్, బీపీ ఉంది. మాది చిరు వ్యాపారం. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. ప్రైవేట్ డాక్టర్ల వద్దకు వెళ్లాలంటే ఫీజులు, టెస్టులకు వేలకు వేలు ఖర్చవుతుంది. ఖరీదైన మందులు కూడా కొనలేం. ఇక్కడ పెద్ద డాక్టర్లందరూ వచ్చారు. నాకు వైద్య పరీక్షలు చేసి, మందులు ఇచ్చారు. జగన్ బాబుకు కృతజ్ఞతలు.

–గుర్రం సూర్యకాంతం, అక్కిరెడ్డిపాలెం

కంటి పరీక్ష చేశారు



నాకు కళ్లు సరిగా కనిపించవు. కళ్లు మసగ్గా ఉండడంతో బాగా ఇబ్బంది పడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్షలో ఉచిత కంటి పరీక్షలు చేస్తారని తెలిసి వచ్చా. డాక్టర్లు పరీక్షించి కళ్ల జోడు వాడాలని చెప్పారు. వలంటీర్ ఇంటికే కంటి అద్దాలు తెచ్చిస్తారని వైద్యులు తెలిపారు. చాలా సంతోషం. పైసా ఖర్చు లేకుండా, ఎక్కడికీ తిరిగే అవసరం లేకుండా వైద్యం అందింది.

–వి.కృష్ణకుమారి, అక్కిరెడ్డిపాలెం

క్లుప్తంగా

మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా


మృతుని కుటుంబానికి బీమా నగదు అందజేస్తున్న కార్పొరేటర్ రామారావు

గాజువాక: జీవీఎంసీ 71వ వార్డు సుందరయ్య కాలనీలో అకాల మరణం చెందిన గుత్తల మీరా సాహెబ్‌కు వైఎస్సార్ బీమా మంజూరైంది. వైఎస్సార్ బీమా పథకం నుంచి రూ.1 లక్ష మంజూరు కాగా, రూ.10వేలను తక్షణ సాయంగా మృతుని భార్యకు వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు గురువారం అందజేశారు. మిగిలిన రూ.90 వేలను ఆమె ఖాతాకు జమ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ సెక్రటరీ, వార్డు వలంటీర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక


నాగమహేంద్రను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఎస్.నాగమహేంద్ర రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. నాగమహేంద్ర దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డులోని పావని స్కూల్లో 9వ తరగతి విద్యార్థి. ఈ సందర్భంగా మహేంద్రను పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.శ్యామల, కుమార్ రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ


సదస్సులో పాల్గొన్న వక్తలు

గాజువాక: మహిళలు అత్యధికంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లకు గురవుతున్నారని ప్రముఖ రేడియేషన్ అంకాలజీ స్పెషలిస్టు డాక్టర్ ప్రభ అన్నారు. ప్రారంభ దశలోనే గుర్తిస్తే క్యాన్సర్ నుంచి బయటపడొచ్చన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాన్సర్‌పై అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. 20 నుంచి 40 ఏళ్లమధ్య వయసు గల మహిళలు తప్పకుండా స్క్రీనింగ్ టెస్టులను చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్ర మహాలక్ష్మి, డైరెక్టర్ కృష్ణకుమారి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఐపీఎస్ అధికారి శివగామి


శివగామి సుందర్‌నందాకు అప్పన్న జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో భ్రమరాంబ

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం స్పెషల్ సెక్రటరీ డీజీపీ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ శివగామి సుందర్‌నందా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆమెకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం


చేతుల శుభ్రం చేసుకునే విధానాలను తెలుసుకుంటున్న విద్యార్థులు

కూర్మన్నపాలెం: చేతులను శుభ్రంగా కడుక్కోవడం ద్వారా అంటురోగాలు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చని కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యప్రకాశరావు అన్నారు. గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే ను పురస్కరించుకుని మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చేతులను శుభ్రం చేసుకోకపోతే ఆహారం తినేటప్పుడు క్రిములు నోటి ద్వారా శరీరంలోకి ప్రవేశించి రోగాల బారిన పడతారన్నారు. విద్యార్థులు చేతులు సరిగ్గా శుభ్రం చేసుకుని, ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. మ్యాజిక్ బస్ ప్రతినిధులు విద్యార్థులకు హ్యాండ్ వాష్ విధానాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ మన్నాజీ, అరుణ, భారతి, వరలక్ష్మి, వేద, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సభ్యులు టీఎంఓ ఆర్.శంకర్, ఎం.గౌతమి, ఆర్.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు

సీఎం జగన్‌తో భేటీకి సహకరించాలని వినతి


ఎమ్మెల్యే నాగిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న పోరాట కమిటీ నాయకులు

పెదగంట్యాడ: ఈ నెల 16న విశాఖ పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశం ఏర్పాటు చేయాలని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కోరారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఆయన్ను కలిసి, వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమం వచ్చే నెల 8 నాటికి 1000 రోజులు పూర్తి చేసుకుంటోందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ ఏర్పాటు చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు సహకరించాలన్నారు. ఇప్పటి వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రభుత్వం అన్ని విధాలా సహకరించారని, మరోసారి ముఖ్యమంత్రిని కలిసేలా ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో వై.మస్తానప్ప, డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, కేఎస్ఎన్ రావు, గణపతి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందం ఉల్లంఘించిన సంస్థకు ఫోరం జరిమానా


మాట్లాడుతున్న రమేష్, రామ అప్పారావు

అగనంపూడి: ఒప్పందం మేరకు వినియోగదారుడికి లిఫ్టును సరఫరా చేయకపోవడంతో, వినియోగదారుల ఫోరం సంస్థకు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. వివరాలివి.. సమాచార హక్కు చట్టం కార్యకర్త నిమ్మకూరి రమేష్ జుక్కి ఎస్కలేటర్స్ అండ్ లిఫ్ట్ సంస్థతో జరిగిన ఒప్పందం మేరకు లిఫ్ట్ కోసం రూ.పది లక్షలు చెల్లించారు. పలు విడతల్లో ఒప్పంద మొత్తాన్ని చెల్లించినా, నిర్ణీత గడువు సమయానికి లిఫ్టును సరఫరా చేయకపోవడంతో సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు సహకారంతో ఈ ఏడాది మార్చిలో వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. కమిషన్ పూర్వాపరాలు పరిశీలించిన మేరకు రమేష్ చెల్లించిన మొత్తాన్ని ఆరుశాతం వడ్డీతో చెల్లించాలని, ఖర్చుల కోసం మరో పదివేల రూపాయలు 90 రోజుల్లో చెల్లించాలని ఆదేశించినట్లు వారు తెలిపారు.

మందుల వినియోగంపై కేంద్ర కమిటీ ఆరా


గొల్లలపాలెం పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో గురువారం ఇద్దరు వైద్యులతో కూడిన కేంద్ర పబ్లిక్ రిలేషన్స్ కమిటీ పర్యటించింది. కేరళకు చెందిన వైద్యులు సజిత, అనితకుమారి ఈ బృందంలో ఉన్నారు. వీరు పంచాయతీలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఆరోగ్య సిబ్బంది ఎలాంటి మందులు ఇస్తున్నారు, ఏఏ పరీక్షలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. తర్వాత పంచాయతీలోని ప్రజలతో వైద్య చికిత్సల గురించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వినియోగిస్తున్న మందుల గురించి ఆరా తీశారు. ఈ వివరాలతో నివేదిక తయారు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ జీవనరాణి, తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు, సర్పంచ్ పాట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ పల్లా నీలిమ, ఎస్‌వో మురళీకృష్ణ, ఈవో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మెస్ పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల హాస్టల్‌ను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా తెలుసుకున్నారు. వస్తువుల నాణ్యత నుంచి వండి, వడ్డించే వరకు తీసుకుంటున్న చర్యలను ఆయన గమనించారు. వస్తువుల సరఫరా విషయంలో ఎటువంటి రాజీ పడవద్దని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందించే విధంగా సిబ్బంది పనిచేయాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల నుంచి పలు సూచనలు ఆయన స్వీకరించారు. మెస్‌లో నాణ్యత ప్రమాణాలను మరింత పెంపుదల చేసే విధంగా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు నేరుగా తన దృష్టికి సమస్యలు తీసుకురావచ్చని చెప్పారు.

ఐటీఐ విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత


సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే నాగిరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

పెదగంట్యాడ: ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు వెంటనే అప్రెంటిస్ చేసి, ఉద్యోగాల్లో స్థిరపడాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ప్రభుత్వ న్యూ ఐటీఐలో 2023లో ఐటీఐ పాసైన విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గాజువాక స్టీల్‌సిటీ ఐటీఐలో విద్యార్థులకు శిక్షణతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో ప్రిన్సిపాల్, అధ్యాపకుల పాత్ర అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐఎంసీ చైర్మన్ ఏకే బాలాజీ, ఐటీఐ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిస్ట్‌లో..

అగనంపూడి: డీజీటీ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఐటీఐ విద్యార్థులకు నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. లంకెలపాలెంలోని నిస్ట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మైలాన్ లేబరేటరీస్ హెడ్ సునీల్ రాయ్ వాదా మాట్లాడుతూ ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు జాతీయ స్థాయి పాఠ్యాంశాల మేరకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నిస్ట్ చైర్‌పర్సన్ బులుసు వీరజమ్మ, మేనేజింగ్ ట్రస్టీ బులుసు ఆనందరావు, ప్రిన్సిపాల్ అక్కిరెడ్డి దుర్గ నాయుడు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థుల కలశ యాత్ర


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

అగనంపూడి: నా మట్టి .. నా దేశం కార్యక్రమంలో భాగంగా దువ్వాడలోని విజ్ఞాన్ ఫార్మా కళాశాల విద్యార్థులు కలశ యాత్ర ప్రారంభించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ పీవో సత్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి

- ఉపాధ్యాయులకు డీఈవో చంద్రకళ సూచన
- గాజువాక, యారాడ హైస్కూల్స్ సందర్శన


డీఈవో చంద్రకళకు మొక్కను బహూకరిస్తున్న ఉపాధ్యాయులు

గాజువాక/పెదగంట్యాడ: విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెంచుకోవడంతో పాటు వారి సామర్థ్యలను మెరుగుపరుచుకునేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. మండలంలోని గాజువాక, యారాడ జిల్లా పరిషత్ హైస్కూళ్లను ఆమె గురువారం సందర్శించారు. అనంతరం ఆమె గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి వారు మంచి మార్కులు సాధించే విధంగా బోధన సాగించాలన్నారు. బడి మానేసిన విద్యార్థులను గుర్తించి, వారిని మళ్లీ స్కూళ్లలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు సునీత, విశ్వనాథం, సమగ్ర శిక్ష అభియాన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన రంగంలో రాణించాలి

- నూతన ఔషధాలను అన్వేషించాలి
- కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్
- ఘనంగా ఫార్మా– డీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు


పట్టాలు పొందిన ఫార్మా–డీ విద్యార్థులతో అతిథులు

ఏయూక్యాంపస్: ఫార్మా–డీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు పరిశోధన రంగంలో రాణించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ ఆకాంక్షించారు. ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన ఫార్మా–డీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ నూతన ఔషధాలు, మూలకాల అన్వేషణ జరిపే దిశగా కృషి చేయాలని సూచించారు. వైద్యులతో అనుసంధానంగా పనిచేయాలన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన తరువాత సమాజానికి మనం ఏ విధంగా ఉపయోగపడగలం అనే ఆలోచన కలిగి ఉండాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వైద్యునికి, రోగికి మధ్య అనుసంధానంగా ఫార్మా–డీ విద్యార్థులు నిలుస్తారన్నారు. ఔషధాలకు సంబంధించిన చట్టాలపై ఏపీ డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.విజయ్ కుమార్ అవగాహన కల్పించారు. ఆచార్య జి.శశిభూషణ రావు, ఆచార్య కేవీ రమణ మూర్తి, ఆచార్య జి.గిరిజా శంకర్, వి.గిరిజా శాస్త్రి, కె.ఈశ్వరకుమార్, ఏకేఎం పవార్, శైలజ పాల్గొన్నారు.

నృసింహుడికి స్వర్ణ సంపెంగ పుష్పార్చన


స్వామి వారి అర్చనకు స్వర్ణపుష్పాలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా జరిపించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. అష్టోత్తర శత నామావళి పటిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారిశేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం ఘనంగా జరిపించారు. ఆలయ బేడా మండపంలో ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి కల్యాణ మహోత్సవం జరిపించారు.

విండ్‌బాల్ క్రికెట్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ


టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22 నుంచి 25 వరకు దేవన్ అన్న క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నామని షైనింగ్ బ్లూస్ టీమ్ ఆర్గనైజర్ జెర్రిపోతుల సురేష్ గౌడ్ తెలిపారు. టోర్నీ పోస్టర్‌ను టీఎన్నార్ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌ను పెదకోరాడ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీం సభ్యులు ఈర్ల భార్గవ్, గొందేశి అనీల్, నవీన్, వెంకటేష్, ఉదయ్, అరవింద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సోషియో ఎమోషనల్ స్కిల్స్‌పై 15న వర్క్‌షాప్

ఉక్కునగరం: జన విజ్ఞాన వేదిక స్టీల్ జోన్, స్టీల్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15న 'సోషియో ఎమోషనల్ స్కిల్స్' అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో ఆ రోజు ఉదయం 9.30 నుంచి 12.30 వరకు నిర్వహించనున్న వర్క్‌షాప్‌లో సైకియాట్రి ఎండీ డాక్టర్ జి. శ్రావణి ముఖ్య వక్తగా ప్రసంగించనున్నారు. 9వ తరగతి, 10వ తరగతి, ఆపై తరగతులు చదివేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయా సంస్థల ప్రతినిధులు కోరారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై కేంద్రం పునరాలోచించాలి


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేద్దామనుకునే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనిపై కేంద్రం పునరాలోచించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 973వ రోజు గురువారం పలు విభాగాల కార్మికులు పాల్గొన్నా రు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు భూములిచ్చిన నిర్వాసితుల్లో కొంతమందికి మాత్రమే ఉపాధి లభించిందని, మిగిలిన వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయన్నారు. కార్మికుల, నిర్వాసితుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని మోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.